# పశు బీమా అమలు ఏదీ...?

**జగిత్యాల, -నవభూమి:** పశు బీమా పథకం అమలు కాకపోవడంతో పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జి ల్లాలో వ్యవసాయం తరువాత రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపైనే ఆ ధారపడి జీవిస్తున్నారు. పాడి పశువుల కొనుగోలుకు కొన్ని సార్లు రూ. లక్ష రూపాయలు కూడా వెచ్చిస్తుంటారు. పాల దిగుబడిని బట్టి పశువు ధర ఉంటుంది. పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ దాని ఆసరాగా చే సుకొని జీవిస్తుంటారు. రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించే వ్యవసా య అనుబంధ రంగాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. రైతులు వ్య వసాయంతో పాటు పాడి పరిశ్రమలను కొనసాగిస్తే ఆర్థికంగా ఆసరాగా ఉంటుంది. ప్రభుత్వం రైతులకు చేయూతనందిస్తామని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. ఆరేళ్లుగా పశు బీమా నిలిపివే యడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పాడి పశువు లకు రైతు వాటా ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం కొంత నగదును కలిపి బీమా సౌకర్యం కల్పించేది. దీంతో పశు వులు మృత్యువాత పడినా వచ్చిన బీమా డబ్బులతో రైతులు మళ్లీ పశువులను కొనుగోలు చేసుకొని భరోసా గా ఉండేవారు. పథకం నిలిచి పోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు.ఆరేళ్లుగా అమలు కాని పథకం...పాడి పశువుల బీమా పథకం 2017-18 వరకు ప్రభుత్వం అమలు చే సింది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరేళ్లుగా ఈ పథకం గురిం చి పట్టించుకోవడం లేదు. గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఆర్థికంగా ఎది గేందుకు పాడి పరిశ్రమ ఎంత గానో దోహదపడుతుంది. పశువులు రోడ్డు, విద్యుత్ ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా మృత్యువాత పడుతున్నాయి. మేలు జాతి పాడి పశువులకు లక్షల్లో డిమాండ్ ఉంది. అనివార్య కారణా లతో పశువులు మృతి చెందితే రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయి అప్పుల్లో కూరుకుపోతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు, పిడుగు పాటు గురై పలు పశువులు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం భీమా పథకాన్ని పునరుద్ధరించి ఆదుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.ప్రభుత్వం అందించిన పశువులకే భీమా...గత రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా లబ్దిదారులకు అందించిన పశువులకు మాత్రమే భీమా సౌకర్యం కల్పిం చింది. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిట్ ధరలోనే పశువులకు భీమా ప్రీమియం చేల్లిస్తున్నానరు. దీంతో ప్రభుత్వం పంపిణీ చేసిన పశువులకు బీమా సౌకర్యం ఉండి రైతులు కొనుగోలు చేసుకున్న పశువు లకు మాత్రం బీమా సౌకర్యం కల్పించకపోవడం సరికాదని రైతులు వాపోతున్నారు. ప్రై వేటు బీమా కంపెనీలను ఆశ్రయించి పశువులకు బీమా చేయించాలంటే సుమారు లక్ష రూపాయలు ఉన్న పశువుకు రూ. 7 నుంచి రూ. 8 వేల ఖర్చు అవుతున్న పరిస్థితి నెలకొనడంతో పాడి రైతులు ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. 1.24 లక్షల గేదెలు, 47,405 ఆవులు..జిల్లా వ్యాప్తంగా గేదెలు 1,24,248 ఉండగా, 47,405 ఆవులు, 6,10,985 గొర్రెలు, 97,033 మేకలు, 14,895 పందులు, కుక్కలు 3,310, ఫౌల్ట్రీ 8,27,595 ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మంది రైతులు పాడి పరిశ్ర మపై ఆధారపడి జీవిస్తున్నారు. పాల వ్యాపారంతో కుటుంబ పోషణ సాగిస్తున్నారు.గేదెలు మరణిస్తే నష్టపోతున్నాం ఒడ్డం శ్రీనివాస్, పాడి రైతు, గోదూరు ప్రభుత్వం బీమా పథకాన్ని ఎత్తివేయడంతో పశువులు మృత్యువాత పడినప్పుడు ఆర్థికంగా నష్టపోతున్నాం. గతంలో బీమా సౌకర్యం ఉన్న ప్పుడు పశువులు మృత్యువాత పడితే బీమా డబ్బులతో తిరిగి పశువులను కొనుగోలు చేసుకునేది. పథకం ఎత్తివేసిన నుంచి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోంది.పథకాన్ని అమలు చేయాలి ఎగుర్ల మహేశ్, పాడి రైతు, జగిత్యాల పశువుల బీమాకు ప్రైవేటు బీమా కంపెనీలను ఆశ్రయిస్తే డబ్బులు అధికంగా ఖర్చు అవుతున్నాయి. దీంతో రైతులు పశు వులకు బీమా చే యించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం పథకాన్ని తిరిగి పున రుద్ధరించాలి. రైతు వాటాధనం కలుపుకొని ప్రభుత్వం ప్రీమియం చెల్లించాలి.ప్రభుత్వ నిర్ణయం మేరకే...మనోహర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ప్రభుత్వ నిర్ణయం మేరకే పశు బీమా పథకం అమలు చేయాల్సి ఉం టుంది. ప్రభుత్వం పంపిణీ చేసిన పథకాలలో లబ్ధి దారులు పొందిన పశువులకు మాత్రమే యూనిట్ విలువ నుంచి బీమా కల్పించారు. రైతుల వద్ద ఉన్న పశువులకు ప్రభుత్వం ఎలాంటి బీమా అవకాశాన్ని కల్పించడం లేదు. గతంలో రైతు వాటాధనంతో పాటు ప్రభుత్వం కొంత మొత్తం చెల్లించి పశువులకు బీమా సౌకర్యం కల్పించేది.








నవభూమి

కరీంనగర్

అనుబంధం

22 సెప్టెంబర్,2024 ఆదివారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


# మళ్లీ రోడ్డెక్కిన బూడిద లారీలు



**పెద్దపల్లి -నవభూమి:** మళ్లీ ఓవర్‌లోడ్‌తో బూడిద లారీలు రోడ్డెక్కాయి. ఓవర్‌లోడ్‌తో బూడిద తరలింపుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నెలరోజులపాటు రవాణా నిలిచిపోగా, తాజాగా వారం రోజుల క్రితం నుంచి మళ్లీ బూడిదను తరలించడం ప్రారంభించారు. అధికారుల కళ్లు గప్పి రాత్రిపూట యథేచ్ఛగా ఓవర్‌లోడ్‌తో బూడిదను తరలిస్తున్నారు. మార్గమధ్యలో లారీల నుంచి తెప్పలుతెప్పలుగా రాలుతున్న బూడిద రహదారిపై వెళుతున్న వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీలో బొగ్గు ఆధారితంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. బొగ్గు కాల్చడం వల్ల వెలువడే బూడిద కోసం కుందనపల్లి వద్ద 500 ఎకరాల్లో యాష్ పాండ్‌ను నిర్మించారు. దీంట్లో పెద్ద ఎత్తున బూడిద నిల్వలు ఉన్నాయి. ఈ పాండ్ నుంచి సింగరేణికి ఉచితంగా బూడిదను తరలించుకుపోతున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గును వెలికితీసిన తర్వాత వాటిని బూడిదతో నింపుతున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో పెద్దఎత్తున బూడిదను వాడుతున్నారు. సింగరేణి, జాతీయ రహదారులకు బాటమ్ యాష్‌ను వినియోగిస్తున్నారు. 2028 నాటికి యాష్ పాండ్‌లో బూడిదను అంతా ఖాళీ చేసేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే(జాతీయ రహదారులు)ల నిర్మాణంలో బాటమ్ యాష్‌ను వాడాలని నిర్ధేశించింది. ఆ మేరకు ఎక్కడైతే జాతీయ రహదారులను నిర్మిస్తున్నారో, దానికి సమీపంలోని పవర్ ప్లాంట్‌ల నుంచి ఉచితంగా బాటమ్ యాష్‌ను తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణాల కోసం జిల్లాలోని కుందనపల్లిలోగల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి గత ఐదు మాసాల నుంచి బూడిదను తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి దాదాపు 200 నుంచి 250 కిలోమీటర్ల దూరం వరకు పెద్ద పెద్ద లారీల్లో బూడిదను తరలిస్తున్నారు. ఒక్కో లారీలో నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 టన్నుల వరకు బూడిదను తరలిస్తున్నారు. రవాణా చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు లారీల వాహనాల బాడీని మరింత ఎత్తుకు పెంచి వాటి సామర్థ్యానికి మించి ఒక్కో లారీలో 20 నుంచి 30 టన్నుల బూడిదను అదనంగా తీసుకవెళు తున్నారు.వారం రోజుల నుంచి..కుందనపల్లి యాష్ పాండ్ నుంచి బసంత్‌నగర్, పెద్దపల్లి కరీంనగర్ బైపాస్ హుజూరాబాద్, వరంగల్ మీదుగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు బూడిదతో లారీలు వెళుతున్నాయి. రెండు మాసాల క్రితం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బూడిద లారీలను హుజూరాబాద్ సమీపంలో నిలిపివేశారు. ఎన్టీపీసీ బూడిదను నేషనల్ హైవే కోసం బూడిదను ఉచితంగానే ఇస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు మాత్రం ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. మూడు వాహనాల్లో తరలించే బూడిదను రెండు వాహనాల్లోనే తరలిస్తున్నారు. దీంతో రోడ్లపై తీవ్ర భారం పడుతున్నది. స్పీడ్ బ్రేకర్లు, బొందలు, రోడ్లు దెబ్బతిన్న చోట్ల బూడిద వాహనాల్లోంచి తెప్పలుతెప్పలుగా పడుతున్నది. దీంతో ఆ బూడిద అంత గాలికి లేచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర లారీలు, వ్యాన్లు, బస్సుడ్రైవర్ల కళ్లలో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా చిన్నచిన్న ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో ఓవర్‌లోడ్‌పై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అధికారులు వాటిపై కొరఢా ఝుళిపించారు. దీంతో నెలరోజుల పాటు రవాణా నిలిచిపోయింది. వారం రోజుల క్రితం నుంచి మళ్లీ ప్రారంభించారు. రాత్రివేళలో ఓవర్ లోడ్‌తో బూడిదను తరలిస్తున్నారు. ప్రతి రోజు యాష్ పాండ్ నుంచి 100 నుంచి 150 బూడిద లారీలు వెళుతున్నట్లు సమాచారం. అప్పన్నపేట ఫ్లైఓవర్ సమీపంలో లారీల డ్రైవర్లు పక్కన నిలపడం వల్ల రోడ్ సైడ్ బర్మ్‌లు గుంతలుపడ్డాయి. వాహనాలను నిలిపిన చోట కూడా రోడ్డుపై బూడిద పడుతున్నది. ఓవర్‌లోడ్ రవాణాపై ఫిర్యాదులు రావడంతో రెండు రోజుల నుంచి రవాణా శాఖాధికారులు నిఘా పెట్టారు. గడిచిన రెండు రోజుల్లో రాత్రి వేళలో ఓవర్‌లోడ్‌తో వెళుతున్న 21 వాహనాలను ఆర్‌టీవో రంగారావు పట్టుకుని కార్యాలయానికి తరలించి ఓవర్‌లోడ్‌పై కేసులు నమోదు చేశారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే ఏ వాహనాన్నైనా సీజ్ చేస్తామని, ఓవర్‌లోడ్‌ను సహించేది లేదని రంగారావు హెచ్చరించారు.

## పెద్దచెరువు కబ్జా



**మెట్‌పల్లి -నవభూమి:** పంటల సాగుకు.. ప్రజల తాగునీటికి అండగా ఉన్న మెట్‌పల్లి పెద్ద చెరువు ఆక్రమణలకు గురవుతోంది.బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు వెలిసినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సర్వేనంబర్ 172లో 135 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తరించి ఉంది. ఇందులో 113 ఎకరాలు ఎఫ్‌టీఎల్, 22 ఎకరాలు బఫర్‌జోన్‌లో ఉంది. ఈ చెరువు కింద 656 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు నిండుగా ఉంటే ప్రజల దాహార్తి తీర్చడంతో పాటు పంటల సాగుకు భరోసాగా ఉంటుంది.చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. చెరువు బఫర్‌జోన్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. అధిక వర్షాలు కురిసి చెరువు నిండినప్పుడల్లా పాఠశాల చుట్టూ మోకాళ్ల వరకు నీరు చేరుతుంది. దీంతో పాఠశాలకు సెలవు ఇచ్చి నీరు తగ్గిన తర్వాత తెరుస్తున్నారు. పాఠశాల పక్కనే పలువురు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. చెరువులో కొందరు పంటలు సాగు చేయడంతో నిండినప్పుడల్లా మునిగిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.అభివృద్ధి పేరిట ధ్వంసం చెరువును మినీట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వంలో పనులను ప్రారంభించారు. చెరువు కట్టను తొలగించి నీటిని ఖాళీ చేసి పనులు చేపట్టారు. కట్ట తొలగించిన చోట మరమ్మతు చేపట్టకపోవడంతో ప్రస్తుతం చెరువులో నీరంతా వృథాగా వెళ్లి వాగులో కలుస్తోంది. చెరువు స్థలం ఆక్రమణకు గురి కాకుండా చుట్టూ హద్దులు ఏర్పాటు చేయాలని, చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తేనే పట్టణంతో పాటు గ్రామాలకు తాగు, సాగునీటి కష్టాలు రాకుండా ఉంటాయని భాజపా నాయకుడు చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా ఏర్పాటు చేసినట్లు మెట్‌పల్లి పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలు తొలగించి కాపాడాలని, జిల్లా అధికారులు చొరవ చూపి కబ్జా స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం ప్రభుత్వాన్ని కోరారు.ఆక్రమిస్తే కఠిన చర్యలు అరుణ్‌కుమార్, ఇరిగేషన్ డీఈ మెట్‌పల్లి పెద్ద చెరువును పరిశీలించి ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలు జరిగినట్లు గుర్తించి బల్దియా నుంచి నోటీసులు అందించాం. చెరువును కబ్జా చేస్తే ఉపేక్షించేదిలేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

## మధ్యాహ్న భోజన బిల్లులు వచ్చేశాయ్

**పెద్దపల్లి -నవభూమి:** ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తీపికబురు. ఎట్టకేలకు ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.ఇటీవల పెండింగ్ బిల్లుల కోసంనిర్వాహకులు ఆందోళన బాట పట్టారు. పలుమార్లు భోజనం వండటాన్ని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కూరగాయలకు రూ.126.4 లక్షలు, కోడిగుడ్లకు రూ.99.47 లక్షలు, నిర్వాహకుల గౌరవ వేతనం రూ.49.82 లక్షల చొప్పున బిల్లులు విడుదలయ్యాయి. మూడు నెలలకు సంబంధించి బిల్లులు రావడంతో ఆర్థిక వెతలు దూరంకానున్నాయి.వారానికి మూడు కోడిగుడ్లు సర్కారు బడుల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ అభియాన్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2,650 ప్రభుత్వ పాఠశాలల్లో మంది 1,24.547 విద్యార్థులు భోజనాన్ని తింటున్నారు. రోజు విడిచి రోజు (వారంలో మూడు సార్లు) ఉడికించిన కోడిగుడ్డును అందిస్తున్నారు. వంట నిర్వాహకులకు ఒక్కోదానికి రూ.5 చొప్పున చెల్లిస్తున్నారు. అయితే బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డుకు ఒక్కోసారి రూ.6.50 ధర ఉంటుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.



# మత్స్యకారులకు ఉపాధి దొరికేనా?



**పెద్దపల్లి -నవభూమి:** మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఊసే ఈసారి కనిపించడం లేదు..జులై నెలాఖరులోగా చేప పిల్లలను జలాశయాల్లో వదిలితే చేపలు బాగా ఎదుగుతాయి. ఈసారి సెప్టెంబరు వచ్చినా ఇంకా టెండర్ దశలోనే ఉండటంతో మత్స్యకారులు ఇంకెప్పుడు పంపిణీ చేస్తారోమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతేడాది దాదాపు 2,965 చెరువులకు రూ.6.38 కోట్ల మేర గుత్తేదారులు ఆన్‌లైన్ టెండర్లు దక్కించుకుని 6.32 కోట్ల చేపపిల్లలను సరఫరా చేశారు. ఏడాది గడిచినా వీటికి సంబంధించిన టెండర్ నిర్వహణ నిధులు వారి ఖాతాలకు జమకాలేదు. వీటిని చెల్లించకుండానే ప్రభుత్వం ఈసారి ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి గుత్తేదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో సరఫరా చేసిన చేపపిల్లల విత్తనాల పంపిణీ నిధులు విడుదల చేయకముందే టెండర్లు ఎలా ఆహ్వానిస్తారని గుత్తేదారులు హైదరాబాద్‌లోని మత్స్యశాఖ కార్యాలయం ముందు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. జిల్లా కార్యాలయాల్లోనూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రాలు సైతం సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో చేప పిల్లల పంపిణీపై మొదట్లో సందిగ్ధం నెలకొంది. తాజాగా సెప్టెంబరులో చేపల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది టెండర్లు దాటకపోవడం గమనార్హం. ఈ టెండర్లు కూడా గతంలో పంపిణీ చేసి ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సిన గుత్తేదారులు కావడం విశేషం. వీరు కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లో గతంలో రావాల్సిన డబ్బుల కోసమే మరోసారి టెండర్ దాఖలు చేశారని సమాచారం.బకాయిలు చెల్లింపులపై సందిగ్ధం ఉమ్మడి జిల్లాలో మొత్తం 610 మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని 2,965 చెరువుల్లో గతేడాది సుమారు రూ.6.38 కోట్ల విలువైన 6.32 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేశారు. ఒక్కో జిల్లాలో గరిష్ఠంగా 5 వేల టన్నుల చేపల దిగుబడి నికరంగా తీసుకున్నా.. మొత్తం గతేడాది గరిష్ఠంగా 20 వేల టన్నుల చేపల దిగుబడి వచ్చినట్లు మత్స్యశాఖ అంచనా వేసింది.గతేడాది బకాయి నిధులు గుత్తేదారులకు ప్రభుత్వం విడుదల చేయలేదు. గతేడాది చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో సగం శాతం మాత్రమే ఈసారి చెరువుల్లో సరఫరా చేయాలని ముందుగా ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి తర్వాత వారిని ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది.రెండుసార్లు టెండర్ల ప్రక్రియ జారీ చేసినా పాత గుత్తేదారులు మాత్రమే వస్తున్నారు. తమ డబ్బులు ఎప్పుడిస్తున్నారని అధికారులను అడుగుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య నెలకొనడంతో చేపల పంపిణీకి టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం నుంచి నిధుల విడుదల తమ చేతుల్లో లేదని పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖాధికారి భాస్కర్ తెలిపారు.చేప పిల్లలకు బదులు నగదు ఇవ్వాలి పోతరవేణి క్రాంతికుమార్, పెద్దపల్లి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ ప్రతి సంవత్సరం జులై నెలాఖరులో మొదటి భారీ వర్షాల తర్వాత చెరువుల్లో చేపపిల్లలు వదిలిపెట్టడం మత్స్యకారుల సంప్రదాయం. ఇలా కాకుండా ప్రభుత్వం ఏటా సెప్టెంబరు, ఒక్కోసారి అక్టోబరు మొదటి వారం వరకు చేపలు పంపిణీ చేయడంతో వాతావరణం సహకరించక వాటి ఎదుగుదల లోపిస్తోంది. గుత్తేదారులు గరిష్ఠంగా 9 కిలోల చేపకు చెందిన పిల్లలను పంపిణీ చేయాల్సి ఉంటుంది. గుత్తేదారులు మాత్రం కిలో, రెండు కిలోలుండే చేపలకు చెందిన పిల్లలను కవర్లలో ప్యాక్ చేసి ఇస్తుండటంతో అవి ఎదుగుదల లోపించి మృత్యువాత పడుతున్నాయి. ప్రభుత్వం చేప పిల్లలకు బదులు రైతులకు ఇస్తున్నట్లు పెట్టుబడి సాయం మత్స్యకారుల సొసైటీలకు పంపిణీ చేస్తే మేలు.


## ఆయకట్టు ఎగువన..

# కాల్వలు దిగువన

**సిరిసిల్ల -నవభూమి:** మెట్ట ప్రాంతమైన జిల్లాకు గోదావరి జలాలు ప్రధాన ఆధారంగా మారాయి. జలాశయాల పనులతోనే కాల్వల పనులు కూడా ప్రారంభమయ్యాయి.నేటికీ అసంపూర్తి దశలో అరకొర చెరువులను నింపుతూ సరిపెడుతున్నారు. కాల్వల పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నేల ఎత్తు పల్లాలుగా ఉంది. ఇలా కొన్ని చోట్ల దిగువన కాల్వలు, ఆయకట్టు ఎగువన ఉండటంతో సాగు నీరందడంపై రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ ప్యాకేజీల్లో కాల్వల నిర్మాణాలు పూర్తయితే 1.39 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుంది. వీటిలో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం జరిగితేనే దీనిపై మరింత స్పష్టత వస్తుంది.రాష్ట్ర బడ్జెట్‌లో కాళేశ్వరం అసంపూర్తి పనులకు నిధులు కేటాయించారు. నవంబరులో నిలిచిన పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. జిల్లాలో 9వ ప్యాకేజీ మినహా మిగతా 10, 11, 12 ప్యాకేజీల పనుల పర్యవేక్షణ అంతా సిద్దిపేట జిల్లాలోని డివిజన్ కార్యాలయం నుంచి జరుగుతుంది. భూసేకరణలో జాప్యం కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయి. ప్రస్తుతం అన్ని ప్యాకేజీల్లో మేజర్, మైనర్ కాల్వల పనులు జరుగుతున్నాయి.9వ ప్యాకేజీలో వీర్నపల్లిలోని అటవీప్రాంతం గుండా కాల్వల పనులు జరగాలి. దీనికి అటవీశాఖ నుంచి అనుమతులు రాలేదు. అల్మాస్‌పూర్‌లోనూ ప్రధాన కాల్వ, మైనర్ కాల్వల పనులకు భూసేకరణ అడ్డంకిగా మారింది. దీనిలో 560 ఎకరాలకు మొత్తం రూ.177.31 కోట్ల పరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది.ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు రంగనాయకసాగర్ 11వ ప్యాకేజీ కాల్వల ద్వారా నీరందాలి. దాచారం, సిరికొండ, జిల్లెల్ల, బద్దెనపల్లి, నర్సింహులపల్లిలో భూసేకరణ కాక కాల్వల పనులు మధ్యలో నిలిచిపోయాయి. జిల్లెల్ల కొత్త చెరువు నుంచి పెద్దచెరువులోకి నీటిని తరలించే పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీనిలోనే కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.152.82 కోట్లు కావాలి. కొంతమేరకు పరిహారం అందినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.ఇల్లంతకుంట మండలంలో 10వ ప్యాకేజీలోని డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రూ.51.6 కోట్లు అవసరం ఉంది. ఇది పూర్తయితే మండలంలో 30 చెరువులను నింపే వీలుంది.ముస్తాబాద్, గంభీరావుపేటలోని మల్లన్నసాగర్ 12వ ప్యాకేజీ ప్రధాన కాల్వ ద్వారా 32 చెరువులకు నీటిని తరలించవచ్చు. ప్రస్తుతానికి మైనర్ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ ప్యాకేజీలోనూ భూసేకరణకు రూ.139.66 కోట్లు చెల్లించాల్సిన అవసరం ఉంది. ముస్తాబాద్, నామాపూర్, తెర్లుమద్దిలో భూములు కోల్పోతున్న రైతులకు డబ్బుల చెల్లింపులు పెండింగ్‌లో ఉంది.



## అవినీతికి పాడుదాం చరమగీతం




**జగిత్యాల –నవభూమి:** కొత్త కనెక్షన్, సేవల కోసం లంచం తీసుకునే సిబ్బందిపై కఠిన చర్యలకు విద్యుత్తు శాఖ సిద్ధమైంది.లంచం ఇవ్వనిదే పనులు కావనే ఆరోపణలు ఎదుర్కొన్న శాఖ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరాతో పాటు పారదర్శకంగా సేవలు అందించేలా సంస్కరణలు చేపట్టింది. తాజాగా శాఖ తీసుకుంటున్న నిర్ణయాలతో అవినీతి అధికారులు సిబ్బందిలో కొంత ఆందోళన మొదలైంది. పనులు చేసేందుకు సాకులు చూపుతూ నిర్లక్ష్యం చేస్తూ లంచం ముట్టగానే పూర్తిచేసే అధికారులకు మింగుడు పడడం లేదు.జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి డివిజన్లు ఉన్నాయి. రెండు డివిజన్ల పరిధిలో కొందరు అధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు ఉండగా అంకితభావంతో పని చేసే వారు లేకపోలేదు. అయితే కొత్తగా ఏర్పాటు చేసుకునే పరిశ్రమలు, రైస్‌మిల్లులు, వాణిజ్య సముదాయలకు విద్యుత్తు నియంత్రికలు బిగించడం వంటి పనులు చేసేందుకు చేతివాటం ప్రదర్శించేవారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఎన్‌పీడీసీఎల్‌లో టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేయగా అన్ని విద్యుత్తు శాఖ కార్యాలయాల్లో పోస్టర్లను అతికించారు. లంచం డిమాండుపై టోల్ ఫ్రీ నంబరు ప్రజల్లోకి వెళ్లేలా ప్రచారం చేస్తుండటంతో తమపై ఎవరు ఫిర్యాదు చేస్తారో అని అవినీతి ఆరోపణలు ఎదర్కొంటున్న వారు వణుకుతున్నారు. మీటరు బిగించటం, చిన్న చిన్న పనులు చేసేందుకు సిబ్బంది సైతం ఎంతో కొంత ఆశపడతారనే ఆరోపణలు ఉండేవి. టోల్ ఫ్రీ నంబరు వచ్చిన తర్వాత ఉద్యోగాలు కాపాడుకునేందుకు డబ్బులు ఇచ్చినా వద్దనే పరిస్థితి నెలకొంది. టోల్ ఫ్రీ నంబరుపై భారీ ప్రచారం జరిగితే ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే పలువురిపై ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఫిర్యాదులను రహస్యంగా ఉంచడంతో ఆందోళన నెలకొన్నట్లుగా తెలుస్తోంది.బదిలీలు లేకపోవటంతో..చాలా ఏళ్లుగా అధికారులు, సిబ్బంది ఒకే దగ్గర పాతుకుపోవటంతో స్థానికంగా ఉన్న అనుకూలతలతో అవినీతికి అలవాటు పడ్డట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎక్కువ ఆదాయం పొందే ప్రాంతాలకు అనుకూలంగా బదిలీలు కూడా చేయించుకున్నట్లు పేర్కొంటున్నారు. శాఖలో మార్పు తీసుకువచ్చిన తర్వాత త్వరలోనే బదిలీలు కూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తి స్థాయిలో బదిలీలు చేసి లంచం అనే మాట వినబడకుండా చేస్తే నాణ్యమైన సేవలు అందనున్నాయని వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రచారం చేస్తున్నాం సాలియా నాయక్, ఎస్ఈ, జగిత్యాల విద్యుత్తు అధికారులు, సిబ్బంది లంచం డిమాండు చేస్తే టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసేలా రెండు నంబర్లను కేటాయించారు. నంబర్లను పోస్టర్ల రూపంలో ముద్రించి కార్యాలయాల్లో అతికించాం. సిబ్బంది, అధికారులు ఎవరూ అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఆరోపణలు ఉన్న వారు అంకితభావంతో పని చేయాలి.

## మత్స్యకారులకు ఉపాధి దొరికేనా?

**పెద్దపల్లి –నవభూమి:** మత్స్యకారుల ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ప్రారంభించిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఊసే ఈసారి కనిపించడం లేదు..జులై నెలాఖరులోగా చేప పిల్లలను జలాశయాల్లో వదిలితే చేపలు బాగా ఎదుగుతాయి. ఈసారి సెప్టెంబరు వచ్చినా ఇంకా టెండర్ దశలోనే ఉండటంతో మత్స్యకారులు ఇంకెప్పుడు పంపిణీ చేస్తారోమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గతేడాది దాదాపు 2,965 చెరువులకు రూ.6.38 కోట్ల మేర గుత్తేదారులు ఆన్‌లైన్ టెండర్లు దక్కించుకుని 6.32 కోట్ల చేపపిల్లలను సరఫరా చేశారు. ఏడాది గడిచినా వీటికి సంబంధించిన టెండర్ నిర్వహణ నిధులు వారి ఖాతాలకు జమకాలేదు. వీటిని చెల్లించకుండానే ప్రభుత్వం ఈసారి ఆన్‌లైన్ టెండర్లు నిర్విహించి గుత్తేదారులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలో సరఫరా చేసిన చేపపిల్లల విత్తనాల పంపిణీ నిధులు విడుదల చేయకముందే టెండర్లు ఎలా ఆహ్వానిస్తారని గుత్తేదారులు హైదరాబాద్‌లోని మత్స్యశాఖ కార్యాలయం ముందు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. జిల్లా కార్యాలయాల్లోనూ అధికారులకు, ప్రజాప్రతినిధులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రాలు సైతం సమర్పించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొత్త ప్రభుత్వం రావడంతో చేప పిల్లల పంపిణీపై మొదట్లో సందిగ్ధం నెలకొంది.

# పెరిగిన కార్మికుల లాభాల వాటా

**గోదావరిఖని –నవభూమి:** ఎట్టకేలకు ఆరు నెలల తర్వాత సింగరేణి లాభాలను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. దీంతో పాటు కార్మికులకు చెల్లించే లాభాల వాటా శాతాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.దీంతో గుర్తింపు సంఘాల డిమాండ్.. కార్మికుల ఎదురుచూపులు ఫలించాయి. సింగరేణి తాజాగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రూ.37,500 కోట్ల వ్యాపారం చేసింది. ఇందులో రూ.2,388 కోట్లు లాభాలుగా ప్రకటించారు. కార్మికులకు లాభాల పేరిట రూ.796 కోట్ల (33శాతం)ను పంపిణీ చేయనున్నారు.25 వేల మంది ఒప్పంద కార్మికులు సింగరేణిలో మొట్టమొదటిసారిగా ఒప్పంద కార్మికులకు కూడా లాభాల వాటాను పంపిణీ చేసేందుకు ఈ ఏడాది నిర్ణయించారు. ప్రతి ఒప్పంద కార్మికుడికి రూ.5 వేల చొప్పున పంపిణీ చేయనున్నారు. దీంతో సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 25 వేల మంది ఒప్పంద కార్మికులకు లబ్ధి చేకూరనుంది. చాలాకాలంగా కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా పంపిణీ చేయాలనే డిమాండ్ ఉంది. ఈ క్రమంలోనే గుర్తింపు ప్రాతినిధ్యం సంఘాలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లిన నేపథ్యంలో ఆయన సానుకూలంగా స్పందించారు.ఉద్యోగుల కేటగిరీల వారీగా..సింగరేణిలో మొత్తం 37 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో సీనియార్టీ ఉన్న కార్మికులకు అత్యధికంగా రూ.1.8 లక్షలు పంపిణీ చేయనున్నారు. ఉద్యోగుల కేటగిరిల వారీగా లాభాల వాటాను నిర్ణయిస్తారు. బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామం అయ్యే కార్మికులకు కొంత ఎక్కువ శాతం చెల్లిస్తారు. విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రతి మస్టర్‌పై తక్కువ శాతంతో లెక్కించి పంపిణీ చేస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగులు విధులకు హాజరైన శాతం ఆధారంగా ఆయా ఉద్యోగులకు లాభాల వాటా పంపిణీ చేయనున్నారు. ఏడాదిలో వంద మస్టర్లు దాటిన కార్మికులే లాభాల వాటాకు అర్హులు.ప్రభుత్వ సహకారంతో..బి.జనక్‌ప్రసాద్, ఐఎన్‌టీయూసీ, కనీస వేతన సలహా మండలి ఛైర్మన్, సీతారామయ్య, గుర్తింపు సంఘం నాయకుడు సింగరేణి కార్మికులకు 1999లో సమ్మె సందర్భంగా ప్రభుత్వంతో మాట్లాడి తొలిసారిగా లాభాల వాటా ఇప్పించాం. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం లాభాల వాటా కార్మికులకు చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా లాభాల వాటా శాతాన్ని పంపిణీ చేయిస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు కృషి ఫలితంగా ఒప్పంద కార్మికులకు లాభాల వాటా పంపిణీ చేయిస్తున్నాం.

# ప్రహసనం.. పెద్దాసుపత్రిలో వైద్యం

**కరీంనగర్ –నవభూమి:** నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న చందంగా మారింది కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిస్థితి.గత మూడు నెలలుగా రోగులతో కిక్కిరిసిపోతోంది. రోజుకు ఓపీ ఎనిమిది వందలకుపైగా నమోదవుతోంది. దవాఖానా లోనికి వెళ్లి.. బయటకు వచ్చే వరకూ ఎక్కడ చూసినా రోగుల బారులే. అదనపు ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేసినా.. రద్దీ నియంత్రణ సాధ్యం కావడంలేదు. వైద్యులు రోగులను పరీక్షించే చోట, రక్తపరీక్ష కేంద్రాల వద్ద, మందులు తీసుకునే చోట.. అంతటా అదే పరిస్థితి. కొన్ని మందులు మాత్రమే ఇక్కడ ఉంటున్నాయి. మిగతావి బయట కొనాల్సిన పరిస్థితి. ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరమంది.నాడిపట్టరు.. స్టెతస్కోప్ ముట్టరు..ఆసుపత్రిలో చాలా మంది వైద్యులు నాడీ చూడటంలేదు. స్టెత స్కోప్ ముట్టడం లేదు. రోగి చెప్పిన లక్షణాల ఆధారంగా మందులు రాస్తున్నారు. రక్త పరీక్షలు చేయించుకుంటామని రోగులు కోరితేనే పరీక్షలు రాస్తున్నారు. లేదంటే మందులు రాసి పంపుతున్నారు. అత్యవసర వార్డులలోనూ పరిస్థితి ఇలాగే ఉంది.రక్తపరీక్ష కేంద్రంలో పర్యవేక్షణ కరవు కాలానుగుణ వ్యాధులు డెంగీ, చికున్‌గన్యా వంటి వ్యాధులతోపాటు సెల్యులైటీస్ బాధితులు ఇక్కడకు వస్తున్నారు. రక్తంలో ఇన్‌ఫెక్షన్ శాతం తేల్చడానికి పరీక్షలు కీలకం. అయితే ఇక్కడ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రోగుల వివరాలు నమోదు చేయడానికి చాలా సమయం పడుతోంది. నేర్చుకునే విద్యార్థులే అక్కడ అధికంగా కనిపిస్తున్నారు. అసలు ఉద్యోగులు మాత్రం చాలావరకు కనిపించడంలేదు. ఉన్నతాధికారులు కూడా ఈ రద్దీ సమయంలో పర్యవేక్షించకపోవడం దారుణం.ఓపీ నమోదు వద్ద...ఓపీ కేంద్రం వద్ద కూర్చునే ఏర్పాట్లు చేయకపోవడంతో రోగులు నిల్చొలేక నీరసించి పోతున్నారు. ప్రతి రోజు ఎనిమిది వందలమందికి పైగా వస్తున్నారు. వారి వివరాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి వివరాలన్నీ అంతర్జాలంలో నమోదు చేస్తున్నారు. ఇక్కడ ప్రతి రోగికి కనీసం రెండు నిమిషాలైన సమయం పడుతుంది.



## మున్సిపల్ కార్మికుల

# వేతనాలు పెంచాలి

**పెద్దపల్లి –నవభూమి:** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్‌ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరా వు, జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి మున్సిపల్ యూని యన్ అధ్యక్షుడు మహంకాళి సురేష్, ప్రధానకార్యదర్శి బొంకూరి సాగర్, నాయకులు కుక్క అన్వేష్, సుద్దాల సతీష్, మద్దెల రాజయ్య, బడుగు అంజయ్య, బొంకూరి శంక ర్, గుండేటి లక్ష్మి, మామిడిపల్లి శ్రీనివాస్, బడుగు శ్రీనివాస్, ఆరేపల్లి ప్రమీల, సలిగం టి సుశీలతో పాటు కార్మికులు పాల్గొన్నారు. మంథనిలో..సమస్యలు పరిష్కరించాలని కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ–సురేష్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పిం చారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బూడిద గణేష్, కార్మికులు చిప్పకు ర్తి చందు, సింగారపు గట్టయ్య, రాజయ్య, కమల, పోశమ్మలు పాల్గొన్నారు.రామగుండంలో.. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ శివానంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, కిషన్‌నాయక్, వీ నాగమణి, సారయ్య, సత్యం పాల్గొన్నారు.

